ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

చిత్తూరు
జిల్లా వార్తలు

శుక్రవారం 21 ఫిబ్రవరి 2025



మరుగున పడుతున్న మాతృభాషా ప్రాభవం!

- ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు సహా సూచిక బోర్డుల దాకా తెలుగుకు దక్కని ప్రాధాన్యం
- ఒత్తిడి పెట్టని తెలుగు భాషా సంఘాలు

తెలుగు అకాడమీ ఎక్కడ..?

గత ప్రభుత్వ హయాంలో అమలు కాని హామీ

కూటమి ప్రభుత్వమైనా చర్యలు చేపట్టాలని తెలుగు భాషాభిమానుల విజ్ఞాపన

- 6లో



ఇరుగుపొరుగు రాష్ట్రాల్లో మాతృభాషకు జనం పట్టం కడుతున్నారు.అందుకు తగ్గట్టే ప్రభుత్వాలూ మద్దతుగా నిలుస్తున్నాయి.అయితే మనవద్దే మాతృభాషా ప్రాభవం మరుగున పడిపోతోంది. కార్యాలయాలు మొదలుకుని వ్యాపార సముదాయాలు, వాహనాల బోర్డుల్లో సైతం తెలుగుకు ప్రాధాన్యత దక్కడం లేదు. అధికార భాషా చట్టం అమలుకు నోచుకోవడం లేదు.స్వచ్ఛందంగా తెలుగు వ్యాప్తికి, అభివృద్ధికి కృషి చేయాల్సిన తెలుగు భాషా సంఘాలూ ఈ విషయంలో ఉదాసీనంగా మారిపోవడం విషాదకరం.

నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వేతో జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోయారు. రికార్డుల్లో విస్తీర్ణం తగ్గిపోవడం, హద్దులు మారిపోవడం, రైతుల మధ్య విభేదాలు తలెత్తడం.. వంటివి జరిగాయి. దీన్ని సరిచేసేందుకు కూటమి ప్రభుత్వం గ్రామ సభల్ని నిర్వహించి మరీ అర్జీలను స్వీకరించింది.అయితే వాటి పరిష్కారంలోనే ఆలస్యం చోటు చేసుకుంటోంది.



రీసర్వే గ్రామ సభలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

అర్జీల పరిష్కారంలో అలసత్వం

- వైసీపీ చేసిన రీసర్వేతో ఇబ్బంది పడుతున్న రైతులు
- గ్రామసభల్ని నిర్వహించి అర్జీలను స్వీకరించిన కూటమి ప్రభుత్వం

చిత్తూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి):వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలోని 29 మండలాల్లో 329 గ్రామాల్లో 3.02 లక్షల ఎకరాల్ని రీసర్వే చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార దినానికి కూడా రీసర్వే సమస్యలపైనే అధికంగా ఫిర్యాదులు వచ్చేవి. దీంతో కూటమి ప్రభుత్వం రీసర్వే జరిగిన గ్రామాల్లో ప్రత్యేకంగా గ్రామ సభలు నిర్వహించింది. అధికారులు హాజరై రైతుల నుంచి అర్జీలు తీసుకున్నారు. అక్టోబరు 22 నుంచి నవంబరు 15వ తేదీవరకు 327 గ్రామాల్లో నిర్వహించిన సభల్లో 16,128 అర్జీలు వచ్చాయంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. మూడు నెలలు పూర్తయినా.. 2000 అర్జీలను మాత్రమే పరిష్కరించారంటే యంత్రాంగం అలసత్వం స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో రీసర్వే అర్జీల పరిష్కార శాతాన్ని చూసుకుంటే మన జిల్లా అట్టడుగున 26వ స్థానంలో ఉంది.

● కలెక్టరేట్ గ్రీవెన్స్ డేలోనూ అవే ఫిర్యాదులు

ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్స్ డే నిర్వహణ దారుణంగా మారింది. రీసర్వే గ్రామ సభల్లో ఇచ్చిన అర్జీలు పరిష్కారం కాకపోవడంతో బాధితులంతా మళ్లీ కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిస్తే, ఆయన తహసీల్దార్ వంటి అధికారులకు పరిశీలించమని సిఫారసు చేస్తుంటారు.అక్కడ మాత్రం క్షేత్రస్థాయి అధికారులు కలెక్టర్ నుంచి వెళ్లిన అర్జీలను పట్టించుకోవడం లేదు. ఆయా మండలాల్లో కలెక్టరేట్ గ్రీవెన్స్ నుంచి వెళ్లిన అర్జీలు వందల సంఖ్యలో పెండింగులో ఉంటున్నాయి. ఇలా అన్ని అంశాల్లో కలిపి కలెక్టర్ సిఫారసు చేసిన సుమారు 6వేల అర్జీలు మండలాల్లో పెండింగులో ఉన్నాయి.

●ఇకనైనా వేగం పెరిగేనా?

కూటమి ప్రభుత్వం కూడా మండలానికో గ్రామం చొప్పున 31 గ్రామాల్లో ఇటీవల రీసర్వేని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అంతకుముందే రీసర్వే తహసీల్దార్లను కొనసాగిస్తూ ఉత్తర్వులను ఇచ్చింది. రీసర్వే సమస్యలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రీసర్వే తహసీల్దార్లను కేవలం ఆ కార్యక్రమానికి మాత్రమే వినియోగించాలని సీసీఎల్‌ఏ ఆ మధ్య స్పష్టం చేసిన విషయం తెలిసిందే. రీసర్వే అర్జీల పరిష్కారంలో జిల్లా వెనుకబడడంతో ఆర్డీవోలు చొరవ తీసుకుని పరిష్కారంలో వేగం పెంచాలని కలెక్టర్ ఇటీవల ఆదేశించారు.



జీడీనెల్లూరు మండలం చిన్నవేపంజేరి గ్రామానికి చెందిన నీలకంఠారెడ్డికి ఇద్దరు భార్యలు.వసంతమ్మ పేరుతో ఖాతా నెంబరు 558లో మూడెకరాల భూమి ఉంది. అలాగే చిన్నపాపమ్మ పేరుతో 559వ ఖాతాలో రెండెకరాల భూమి ఉంది. ఈ గ్రామంలో రీసర్వే జరిగిన తర్వాత వసంతమ్మ, చిన్నపాపమ్మ పేర్ల మీద ఉండే భూమి ఆన్‌లైన్‌లో చూపించడం లేదు. ఏడాదిగా అధికారుల చుట్టూ తగిన ఆధారాలతో తిరుగుతున్నా స్పందన లేదు. రీసర్వే గ్రామ సభలో అర్జీ ఇచ్చినా ఫలితం లేదు. బ్యాంకు లోన్ కూడా రెన్యువల్ చేయడం లేదంటూ నీలకంఠారెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గుడిపాల మండలం డీవీపల్లెలో వీఎన్ అనసూయ పేరుతో 141/1ఏ సర్వే నెంబరులో 1.76 ఎకరాల పొలముండేది. రీసర్వే తర్వాత ఈ భూమి మరో ముగ్గురి పేరుతో ఆన్‌లైన్‌లోకి మారింది. రీసర్వే గ్రామ సభలో దీన్ని పరిష్కరించమని అర్జీ ఇచ్చినా నేటికీ పరిష్కారం కాలేదు. చలానా కట్టి సర్వే చేయిస్తే మళ్లీ 11 సెంట్లు రికార్డుల్లో నమోదవడం లేదని అనసూయ భర్త నాగరాజు యాదవ్ ఆవేదన చెందుతున్నారు.

వైభవంగా ఆవుల పబ్బం

● జనసంద్రంగా నాగప్ప చెరువు

చౌడేపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆవుల పబ్బం పేరుతో 14 గ్రామాల ప్రజలు నిర్వహించే సంక్రాంతి పండుగ గురువారం వైభవంగా ప్రారంభమైంది.చౌడేపల్లె మండలంలోని నుంజార్లపల్లె, సింగిరిగుంట, నూనెముద్దలపల్లె, పేరావాండ్లపల్లె, పరికిదోన, దొనపల్లె, చిన్నకంపల్లె, మల్లెలవారిపల్లె, దిగువమల్లెలవారిపల్లె, సామిరెడ్డిపల్లె, మడుకూరు, మొరంకిందపల్లె, చౌడగానిపల్లె, గడ్డంవారిపల్లెలకు చెందిన ప్రజలు ఆవుల పబ్బం పేరుతో సామూహికంగా నిర్వహించునే పశువుల పండగ సందడి మొదలైంది. ఈసందర్భంగా దిగువమల్లెలవారిపల్లె చాందిని బండిలో కాటమరాజు ఉత్సవమూర్తిని ఏర్పాటుచేసి మంగళవాయిద్యాలు, కోలాటలు, చెక్క భజనలు, బళ్లారి డ్రమ్స్ నడుమ గ్రామాల్లో ఊరేగిస్తూ పరికిదోన వద్ద ఉన్న నాగప్ప చెరువు వద్దకు తీసుకొచ్చారు. దిగువమల్లెలవారిపల్లె నుంచి 4 చాందిని బండ్లు, దొనపల్లె, పరికిదోన, పరికిదోన ఎస్సీ కాలని, పేరాపల్లె, నూనెముద్దలవారిపల్లె గ్రామాల నుంచి చాందిని బండ్లను విద్యుత్ దీపాలు, ప్రభలతో అలంకరించి మంగళవాయిద్యాల నడుమ గ్రామాలలో ఊరేగిస్తూ నాగప్ప చెరువు వద్దకు తీసుకొచ్చారు. గ్రామాల్లో పశువులను ప్రత్యేకంగా అలంకరించి నాగప్ప చెరువు వద్దకు తీసుకొచ్చి కాటమరాజు విగ్రహానికి ప్రదక్షిణలు చేయించారు. కాటమరాజు ఉన్న చాందిని బండి వెంట నాగప్ప చెరువు కట్ట నుంచి దొనపల్లె అటవీ ప్రాంతంలో ఉన్న కాటమరాజు ఆలయం వద్దకు దేవరెద్దు వెంట కోలాహలంగా పశువులు వెళ్లాయి. చాందినిబండ్లను చూసేందుకు 14 గ్రామాల ప్రజలు నాగప్పచెరువు వద్దకు రావటంతో ఆ ప్రాంతం జన సంద్రంగా మారింది.





ప్రత్యేక అలంకరణలో కాటమరాజు - చాందిని బండిలో కాటమరాజు ఉత్సవమూర్తి



దేవరెద్దు వెంట వెళుతున్న పశువులు



చాందిని బండ్ల వరస

డిప్యూటీ సీఎంపై అసభ్యకర పోస్టు

● ఒకరిపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టు పెట్టిన వ్యక్తిపై గురువారం చిత్తూరు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కుంభమేళాకు డిప్యూటీ సీఎం.. కుటుంబ సమేతంగా హాజరయ్యారు. వీరిపై సోషల్ మీడియాలో చిత్తూరుకు చెందిన హరీష్‌రెడ్డి.. అసభ్యకరంగా పోస్టు పెట్టారు. దీనిపై గిరింపేటకు చెందిన యశ్వంత్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

22న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల22వ తేదీన నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సంబంధిత అధికారులు, సభ్యులు హాజరవ్వాలన్నారు.

డీసీసీబీ సీఈవో బాధ్యతల స్వీకరణ



శంకర్‌బాబును సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవోగా సి. శంకర్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు.2016 సెప్టెంబరు నుంచి 2019 సెప్టెంబరు వరకు డీసీసీబీ సీఈవోగా, 2021 నుంచి 2023 డిసెంబరు వరకు నెల్లూరు జిల్లా డీసీసీబీ సీఈవోగా పనిచేసిన ఈయన బ్యాంకు జీఎంగా 2024 జనవరి నుండి కొనసాగుతున్నారు.బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.బ్యాంకు జీఎంలు మనోహర్ గౌడ్, లిల్లీకేథరిన్, డీజీఎం చలపతి, బ్యాంకు ఉద్యోగుల సంఘ నాయకులు గంగిరెడ్డి, రఘుబాబు, ధనంజయ రెడ్డిలతో పాటు బ్యాంకు ఏజీఎంలు, బ్రాంచ్ మేనేజర్లు, సింగిల్ విండో సీఈవోలు, బ్యాంకు సిబ్బంది నూతన సీఈవోను సన్మానించారు.

పీ4 సర్వే ప్రారంభం

● దిగువ స్థాయి కుటుంబాలకు చేయూతనివ్వడమే లక్ష్యం



చిత్తూరులో సచివాలయ సిబ్బంది సర్వే

చిత్తూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనలో భాగంగా దిగువస్థాయి కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు సంకల్పించిన రాష్ట్రప్రభుత్వం వాటి గుర్తింపుకోసం సర్వే గురువారం నుంచీ ప్రారంభించింది. సచివాలయ ఉద్యోగులు పీ4 సర్వేలో పాల్గొంటున్నారు. తమ క్లస్టర్‌లోని కుటుంబాలకు సంబంధించిన 27 రకాల ప్రశ్నల్ని నింపాల్సి ఉంటుంది.వారి లాగిన్‌లో ఆయా కుటుంబాల వివరాలు ఉంటాయి.ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగులున్నారా? కరెంటు, నీళ్ల కనెక్షన్స్ ఉన్నాయా? సెల్‌ఫోన్ ఉందా? రేషన్‌కార్డు ఉందా?.. ఇలా అనేక రకాల ప్రశ్నలకు సమాధానాలను నింపుతారు. ఆ ఇంటి సభ్యుడి బయోమెట్రిక్ లేదా ఓటీపీ ద్వారా ఈ సర్వే పూర్తి చేస్తారు.మొత్తం సర్వేని పది రోజుల్లో పూర్తి చేయాల్సి ఉండగా.. మండలాల్లో ఎంపీడీవోలు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు బాధ్యత వహించనున్నారు.

పీ4 విధానం అంటే....

సీఎం అయ్యాక చంద్రబాబు కుప్పంలో రెండుసార్లు పర్యటించారు.అప్పుడే పీ4 గురించి ప్రస్తావించారు. పేదలకు సాయం చేసేందుకు ఉన్నతస్థాయి పారిశ్రామికవేత్తలు,ఆయా ప్రాంతాలకు చెందిన ఎన్నారైలు ముందుకు వస్తున్నారని.. వారందరినీ పీ4 విధానంలో ఒకే గొడుగు కిందికి తెస్తామని చెప్పారు. వారందరి సహకారంతో ఆయా కుటుంబాలను అన్ని విధాలా అభివృద్ధి చేయనున్నారు.ఉగాది నుంచి ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని ఆ సమీక్షలో సీఎం ప్రకటించారు.

పీవీకేఎన్ డిగ్రీ కళాశాలకు న్యాక్ 'ఎ' గ్రేడ్




చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి):చిత్తూరు పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ 'ఎ' గ్రేడ్ దక్కింది.ఉన్నత విద్యా సంస్థలను అంచనా వేసి గుర్తింపు ఇచ్చే ప్రభుత్వ సంస్థ నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) త్రిసభ్య కమిటీ బృందం ఈనెల 13, 14 తేదీల్లో పీవీకేఎన్ కళాశాలను సందర్శించిన విషయం తెలిసిందే.ఈ క్రమంలో న్యాక్ 'ఎ' గ్రేడ్ ఇచ్చినట్లు గురువారం రాత్రి వెల్లడైంది.దీంతో ఎస్వీయూ అఫ్లియేటెడ్ 'ఎ' గ్రేడ్ నుంచి అటానమస్ 'ఎ' గ్రేడ్‌కు కళాశాల గుర్తింపు ఎగబాకింది. కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి సారథ్యంలో అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది కళాశాలలో సౌకర్యాల వివరాలను న్యాక్ బృందం ముందుంచారు.కళాశాలలో విద్యాప్రమాణాలతో పాటు అధ్యాపకుల నిబద్ధత, విద్యార్థుల ప్రతిభ, పరిశోధన, మౌలిక వసతులు, పూర్వ విద్యార్థుల సహకారం లాంటివి ఉత్తమ గ్రేడ్ రావడానికి ఉపకరించాయని ప్రిన్సిపాల్ జీవనజ్యోతి తెలిపారు.ఎంతో మంది విద్యార్థుల జీవన ప్రమాణాలను పెంచడానికి వేదికగా నిలబడిన కళాశాలకు తాను ప్రిన్సిపాల్‌గా ఉన్న సమయంలో ఈ గ్రేడ్ ఇవ్వడం గర్వకారణంగా ఉందన్నారు. ఇంతటి విజయానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారి ఆలయ పైకప్పుకు మరమ్మతులు

- లీకేజీల నివారణకు మొదలైన పనులు
- ఉచిత సర్వీస్ కింద చేపట్టిన టీవీఎస్

తిరుమల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారి ఆలయంలో లీకేజీల నివారణ కోసం టీటీడీ పనులు మొదలుపెట్టింది. తిరుమల ఆలయంలో మూలమూర్తి కొలువైన గర్భాలయం తో పాటు పలు మండపాలు, ఉప ఆలయాలు ఉన్నాయి. వీటి నిర్మాణం జరిగి వందల ఏళ్లు కావడంతో ప్రస్తుతం మండపాలు, ఉప ఆలయాల పైకప్పులో చాలా ప్రాంతాల్లో పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో వర్షం కురిసినప్పుడు నీరు లోనికి ప్రవేశిస్తోంది.ఈ క్రమంలో గతేడాది నవంబరు 18వ తేదీన జరిగిన టీటీడీ బోర్డు సమావేశంలో ఈ సమస్యపై చర్చించి తీర్మానం చేశారు. లీకేజీల నివారణ అంశంలో అనుభవం కలిగిన టీవీఎస్ సంస్థతో ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఈ పనులన్నీ ఉచిత సర్వీస్ కింద చేసేందుకు ఆ సంస్థ అంగీకారం తెలిపింది. ఇందులో భాగంగా ఆ సంస్థకు చెందిన సిబ్బంది గురువారం లీకేజీ నివారణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పగుళ్లను గుర్తించి పూడ్చడంతో పాటు పెయింటింగ్ వేస్తున్నారు. మార్చి31వ తేదీన నాటికి మొత్తం లీకేజీలను నివారించేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు.





జస్టిస్ ఇందిరా బెనర్జీ



జస్టిస్ భవానీప్రసాద్ - జస్టిస్ రమేష్ - రామసింగ్ - అజయ్ జైన్ - వీజే సన్నీ - సత్యశ్రీ

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఇందిరా బెనర్జీ, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ భవానీప్రసాద్, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీ రమేష్, ఏపీ ఈఆర్సీ చైర్మన్ టీ రామసింగ్, ఏపీ టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, సినీ నటులు వీజే సన్నీ, సత్యశ్రీ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

27న ఖాళీ డబ్బాల విక్రయానికి
సీల్డ్ టెండర్ల ఆహ్వానం

తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో నెయ్యి, నూనె, జీడిపప్పు ప్యాకింగ్‌కు వినియోగించిన ఖాళీ డబ్బాల విక్రయానికి టీటీడీ సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తోంది. టెండర్ పొందిన భక్తులు ఖాళీ డబ్బాలను 2026 మార్చి 31వ తేదీ వరకు సేకరించవచ్చు. తిరుపతి హరేరామ హరేకృష్ణ రోడ్డులో ఉన్న మార్కెటింగ్ (వేలం) కార్యాలయంలో సీల్డ్ టెండర్లు ఈనెల 27వ తేదీన మధ్యాహ్నం 3 గంటల్లోపు అందజేయాలి. ఇతర సమాచారం కోసం మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877 2264429ను సంప్రదించవచ్చు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు




తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం : రూ.3.48 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 72,745

తలనీలాలు సమర్పించినవారు : 24,156

మరుగున పడుతున్న మాతృభాషా ప్రాభవం!



- గత ప్రభుత్వ హయాంలో అమలు కాని హామీ
- కూటమి ప్రభుత్వమైనా చర్యలు చేపట్టేనా?

తెలుగు అకాడమీ ఎక్కడ..?

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఓ వెలుగు వెలిగిన తెలుగు అకాడమీ చిరునామా ఇప్పుడు ఎక్కడ అనేలా పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర విభజన తర్వాత తిరుపతిలో తెలుగు అకాడమీ ఏర్పాటు చేస్తామనే గత వైసీపీ ప్రభుత్వ హామీ పూర్తిస్థాయిలో నెరవేరలేదు. తిరుపతిలోని ఎస్వీ గోశాలలో ఏర్పాటు చేసిన ఓ తాత్కాలిక భవనంలో తెలుగు అకాడమీ కార్యకలాపాలను నామమాత్రంగా కొంత సాగించింది. అయితే, పూర్తి స్థాయిలో సిబ్బంది కానీ, పుస్తక సామాగ్రి కానీ, ముద్రణ వ్యవహారాలు కానీ, పుస్తక క్రయ, విక్రయాలు కానీ తిరుపతి కేంద్రంగా పూర్తి స్థాయిలో సాగించలేదు. దీని ఫలితంగా వందలాది పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు గల తిరుపతిలో అకాడమీ చిరునామా వెతుక్కోవలసిన పరిస్థితి ఏర్పడింది.తిరుపతిలోనే శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేస్తామని గతంలో తెలుగు అకాడమీ చైర్‌పర్సన్‌గా పనిచేసిన లక్ష్మీపార్వతి ప్రకటించినా ఆ దిశగా ఒక్క అడుగు ముందుకు పడలేదు సరికదా, విజయవాడలోనే తిష్ట వేసిన తెలుగు అకాడమీ కీలక అధికారులను కూడా తిరుపతికి తరలించలేకపోయారు. ముద్రణ వ్యవహారాలన్నీ విజయవాడ కేంద్రంగానే సాగాయి. క్రయ విక్రయాల సంగతి సరేసరి. నేరుగా తెలుగు అకాడమీకి వెళ్ళి ఒక్క పుస్తకం కూడ కొనలేని దౌర్భాగ్యం దాపురించింది. దీంతో సుదీర్ఘ చరిత్ర కలిగిన తెలుగు అకాడమీ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఇందుకు గత ప్రభుత్వ నిర్వాకమే కారణం. ఇప్పుడు కూటమి ప్రభుత్వమైనా దీనిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాల్సి వుంది.తెలుగు నుంచీ సంస్కృత అకాడమీని వేరు చేయడంతో పాటు తెలుగు అకాడమీకి కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది.రాజకీయ ప్రభావం కలిగిన వ్యక్తులకు కాకుండా, భాషా, సాహిత్య రంగాల్లో కృషి చేసిన వారిని గుర్తించి కార్యవర్గంలో చోటు కల్పిస్తే ప్రయోజనం చేకూరే అవకాశం ఉంటుంది.తిరుపతి కేంద్రంగానే శాశ్వత భవనం ఏర్పాటు చేసి పుస్తకాల ముద్రణ, అమ్మకం వంటి కార్యకలాపాలను సాగించాలని,కొత్త తరంలో మాతృభాష, సాహిత్యం పట్ల అభిరుచిని పెంపొందించాలని తెలుగు భాషాభిమానులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు సహా సూచిక బోర్డుల దాకా తెలుగుకు పెద్దగా దక్కని ప్రాధాన్యం

అమలు కాని అధికార భాష అమలు చట్టం

ఒత్తిడి పెట్టని తెలుగు భాషా సంఘాలు



తిరుపతి గోశాలలోని తెలుగు అకాడమీ తాత్కాలిక భవనం

తిరుపతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఇంటా బయటా చెవులకింపుగా, కంటికి నిండుగా వినిపించి కనిపించిన మాతృభాషా ప్రాభవం క్రమేపీ మరుగున పడిపోతోంది. 2012డిసెంబరు చివరి వారంలో ప్రపంచ తెలుగు మహాసభలను తిరుపతిలో నిర్వహించిన సమయంలో ఆ స్ఫూర్తితో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కొంత మేరకు తెలుగు భాషకు, తెలుగు సాంప్రదాయాలకు ప్రాధాన్యత లభించింది. అప్పట్లో చిత్తూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ సహా అధికారులు, ఉద్యోగులు ప్రతి సోమవారం తెల్ల పంచె, తెల్ల చొక్కా, కండువా ధరించి విధులకు హాజరయ్యే వారు. ఫైళ్ళు, ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో జరిపేందుకు ప్రయత్నాలు జరిగాయి. అప్పట్లో పాకాల కోర్టులో న్యాయమూర్తి తెలుగులో తీర్పు ప్రకటించి రాష్ట్రవ్యాప్తంగా అందరికీ ఆదర్శంగా నిలిచారు. అయితే క్రమేపీ ఆ స్ఫూర్తి లోపించింది. దానికనుగుణంగా తెలుగు భాష వినియోగం మరుగున పడగా ఇపుడు ఫైళ్ళు, రికార్డులన్నీ దాదాపు ఇంగ్లీషులోనే సాగుతున్నాయి. ఇ-ఫైళ్ళ పేరిట ఇపుడు ఉత్తరప్రత్యుత్తరాలలో ఇంగ్లీష్ వాడకం మరింతగా పెరిగిందనే చెప్పాలి. అధికారిక సమీక్షల్లో జిల్లా అభివృద్ధిని, వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పేరిట ఇంగ్లీషులోనే ప్రదర్శిస్తున్నారు. అధికార భాషా సంఘం నామమాత్రావశిష్టంగా మారింది. పర్యటనలూ లేవు, సమీక్షలు అంతకన్నా లేవు.



టీటీడీ జలప్రసాదంపైనా ఆంగ్లమే

తెలుగును తోసిరాజని ఆంగ్లానికి పట్టం

దేశంలోనే పేరుమోసిన పర్యాటక కేంద్రం, పుణ్యక్షేత్రమైన తిరుపతిలోనే తెలుగుకు ప్రాముఖ్యత దక్కకపోవడం భాషాభిమానులకు ఆవేదన కలిగిస్తోంది. పలు ప్రధాన కూడళ్ళలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డుల్లో ఇంగ్లీషు తప్ప తెలుగు కనిపించడం లేదు. దేశ విదేశాల నుంచీ వచ్చే యాత్రికుల కోసం వేర్వేరు భాషల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం అవసరమే. అదే సమయంలో వాటి సరసన మాతృభాషకూ చోటు దక్కకపోవడమే విమర్శలకు దారి తీస్తోంది. నగరంలో చాలావరకూ దుకాణాలు, వ్యాపార సముదాయాలకు ఇంగ్లీషులోనే నామఫలకాలు ఏర్పాటు చేసి వుండడం కనిపిస్తోంది.తమిళనాడు నుంచీ తిరుపతికి వచ్చే అక్కడి ప్రైవేటు,ప్రభుత్వ బస్సులపై తమిళ, ఇంగ్లీషు భాషల్లో బోర్డులు కనిపిస్తుండగా కర్ణాటక నుంచీ తిరుపతి వచ్చే అక్కడి ఆర్టీసీ బస్సులపై కన్నడ, ఇంగ్లీషు భాషల్లో బోర్డులు వుంటున్నాయి. ఈ రెండు రాష్ట్రాల బస్సుల గమ్యస్థానం తిరుపతి అయినప్పటికీ ఆ బస్సుల బోర్డుల్లో తెలుగుకు చోటు దక్కడం లేదు. ఈ రెండు రాష్ట్రాల బస్సులపై రవాణా సంస్థల పేర్లు గానీ, బస్సు సర్వీసుల పేర్లు గానీ తమిళ, కన్నడ భాషల్లోనే స్టిక్కరింగ్ చేయించడం కనిపిస్తోంది. కొన్ని బస్సులపై అదనంగా ఇంగ్లీషు కూడా వుంటోంది. అదే ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల విషయానికొస్తే గమ్యస్థానాల పేర్లు తమిళనాడుకు వెళ్ళేవాటిపై తెలుగు, తమిళంలోనూ, కర్ణాటక వెళ్ళేవాటిపై తెలుగు, కన్నడ భాషల్లోనూ రాయించి ఉదారత చాటుతున్నాయి. ఇది మంచి పద్ధతే కానీ అదే బస్సులపై రవాణా సంస్థ లేదా బస్సు సర్వీసుల పేర్ల విషయానికొస్తే ఎక్కువగా ఇంగ్లీషులోనే స్టిక్కరింగ్ చేయించడం కనిపిస్తోంది. మాతృభాషకు ప్రాధాన్యత ఇవ్వడంలో ఇరుగు పొరుగు రాష్ట్రాలను చూసి నేర్చుకోవాల్సిన అవసరం వుందని చెప్పాలి.



తిరుపతిలో షాపులపై తెలుగేదీ?





కర్ణాటక, తమిళనాడు బస్సులపై కనిపించని తెలుగు

తెలుగు భాషా సంఘాల ఉదాసీనత

స్వచ్ఛందంగా తెలుగు వ్యాప్తికి, అభివృద్ధికి సేవలందించాల్సిన తెలుగు భాషా సంఘాల పాత్ర అంతకంతకూ తగ్గిపోతోంది.ఇరుగుపొరుగు రాష్ట్రాల్లో మాతృభాషకు అక్కడి జనం పట్టం కడుతున్న తీరును కళ్ళారా చూస్తూ కూడా తెలుగు భాషా సంఘాలు ఉదాసీనంగా వుండడం గమనార్హం.ఇప్పటికైనా ఆ సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తెలుగు భాషాభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరముంది.


నేటి నుంచి ముక్కంటీశ్వరాలయంలో
శివరాత్రి ఉత్సవాలు



భక్త కన్నప్ప

భక్తకన్నప్ప ధ్వజారోహణంతో ప్రారంభం

అంగరంగ వైభవంగా ఏర్పాట్లు





విద్యుత్ కాంతులతో ముక్కంటి ఆలయం



ఆలయంలో పూల అలంకరణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహా శివరాత్రి ఉత్సవాలు శుక్రవారం భక్తకన్నప్ప ధ్వజారోహణంతో ప్రారంభంకానున్నాయి. పరమశివుడి వరంతో కన్నప్పగా మారిన తిన్నడికి కొండపై స్థానమిచ్చి, కిందిభాగంలో దేవదేవుడు కొలువైన పుణ్యక్షేత్రమిది. దీంతో భక్తుడు కన్నప్పకు తొలిపూజ చేసి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయడం ఆనవాయితీగా వస్తోంది. 14 రోజులు జరిగే శివరాత్రి ఉత్సవాల్లో ప్రథమంగా కన్నప్ప ధ్వజారోహణం జరగనుంది. ఇందులో భాగంగా శుక్రవారం ఆలయ అలంకార మండపం నుంచి భక్తకన్నప్ప ఉత్సవమూర్తిని కొండపైకి ఊరేగింపుగా తీసుకువెళ్తారు. అక్కడ వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి, శాస్త్రోక్తంగా కన్నప్ప ధ్వజారోహణం మహాక్రతువును నిర్వహించి దేవతలకు ఆహ్వానం పలుకుతారు. ఈ క్రమంలో కొండ, చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్యుత్ దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంటోంది.

ఆకట్టుకుంటున్న అలంకరణలు

భవుడి మహా శివరాత్రి ఉత్సవాలకు శ్రీకాళహస్తి సర్వాంగసుందరంగా ముస్తాబైంది. ప్రధాన ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, రంగ వల్లులతో అలంకరించారు. గోపురాలకు కొత్త రంగులద్దడంతో. కళకళలాడుతున్నాయి. భక్తకన్నప్ప, రామసేతు వంతెన, పట్టణవ్యాప్తంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో చలువపందిళ్లు ఏర్పాటు చేశారు. చతుర్మాడ వీధులు, సాంస్కృతిక కార్యక్రమాల వేదికైన ధూర్జటి కళా ప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. సన్నిధి వీధిలో కైలాసం సెట్టింగ్ పనులు జోరుగా సాగుతున్నాయి. రథాలు, నారద పుష్కరిణిలోని తెప్పలను రంగులతో ముస్తాబు చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈవో బాపిరెడ్డి చేతులమీదుగా వీటిని ప్రారంభించనున్నారు.



ధూర్జటి కళా ప్రాంగణం

ఉత్సవాల్లో నేడు...

- తెల్లవారుజామున 4:30 గంటలకు మంగళ వాయిద్యాలు
- ఉదయం 5గంటలకు గోపూజ, సుప్రభాతం, సర్వదర్శనం
- 6 గంటలకు ప్రథమ కాలాభిషేకం
- 7 గంటలకు ద్వితీయ కాలాభిషేకం
- 8 గంటలకు పరివార దేవతలకు నైవేద్యం, నిత్యోత్సవం
- 10 గంటలకు ఉచ్చికాలాభిషేకం
- మధ్యాహ్నం 3 గంటలకు కన్నప్ప కొండకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల తరలింపు
- సాయంత్రం 4 గంటలకు భక్తకన్నప్ప ధ్వజారోహణం
- 5 గంటలకు ప్రదోష కాలాభిషేకం
- 6 గంటలకు భక్తకన్నప్ప గ్రామోత్సవం
- 7 గంటలకు భక్తకన్నప్ప ఆలయ ప్రవేశం, స్వామి అమ్మవార్లకు ధూపదీప, నైవేద్యం, మంత్రపుష్ప సమర్పణ
- రాత్రి 8 గంటలకు మత్స్యగ్రహణం, అంకురార్పణ, వాస్తు శాంతి
- రాత్రి 9 గంటలకు పళ్లియర పూజ, స్వామి దర్శనం ముగింపు

విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపడమే ధ్యేయం

రంగంలోకి కౌన్సెలింగ్ బృందాలు ● ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 24 మండలాల్లోని పాఠశాలల ఎంపిక




చిత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నిరాశ, నిస్పృహలకుతోడు చెడు అలవాట్లకు విద్యార్థులు బానిసలవడంతో పెరిగిపోతున్న ఆత్మహత్యలు, అఘాయిత్యాలను నివారించి.. వారిలో ఆత్మస్థైర్యం నింపడమే ధ్యేయంగా కౌన్సెలింగ్ బృందాలను రంగంలోకి దింపేందుకు విద్యాశాఖ కసరత్తు పూర్తి చేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 24 మండలాల్లోని పాఠశాలల విద్యార్థులకు ఈ బృందాలు కౌన్సెలింగ్ నిర్వహించనున్నాయి. ఎం.క్రాంతికుమార్, కె.వెన్నెల, బి.భాగ్యశ్రీ, వై.శ్రీరాములును రాష్ట్ర విద్యాశాఖ హెడ్ కౌన్సెలర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హెడ్ కౌన్సెలర్ కింద మరో కౌన్సెలరు ఉంటారు. ఎంపిక చేసిన పాఠశాలకు ఇద్దరు (హెడ్ కౌన్సెలర్, కౌన్సెలర్) వెళ్లి విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగుతూ.. వారిలోని బలహీనతలు గుర్తించి ఆత్మస్థైర్యం నింపే ప్రక్రియ చేపట్టనున్నారు. విద్యార్థినులకు గుడ్ అండ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పిస్తారు. ప్రతికూల సందర్భాలు ఎదురైతే ఎలా రక్షించుకోవాలో తెలియజేస్తారు. చెడు అలవాట్లకు బానిసలు కావడానికి దారితీస్తున్న పరిస్థితులను, ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్న కారణాలకు గుర్తించి నివారణకు తగిన సూచనలు చేయనున్నారు. ఇప్పటికే ఆత్మరక్షణ పేరుతో ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌లో విద్యార్థినులకు కరాటే నేర్పించే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిన విషయం తెలిసిందే.

పుంగనూరు మండలం నెక్కొంది కొండపై వున్న అగస్తీశ్వర స్వామి ఆలయంలో ఏటా మహాశివరాత్రికి 11రోజులపాటు ప్రసన్నపార్వతీదేవీ సమేత అగస్తీశ్వరస్వామి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. అద్భుత శిల్పకళ కట్టడాలతో ఒకనాటి చోళరాజులు కొండ శిఖరాగ్రంలో ఈ ఆలయాన్ని నిర్మించారని చరిత్ర చెబుతోంది.అగస్త్యమహాముని తూర్పు భాగంలో మూలవిరాట్టును శివస్వరూపంలో ప్రతిష్టించారని, పక్కనే చోళరాజులు భోగ అగస్తీశ్వరున్ని ప్రతిష్టించారని చెబుతారు.ఈ ఆలయ నిర్వహణకు జమీందారులు అనేక ప్రాంతాల్లో మాన్యాలు ఇచ్చారు.మహా శివరాత్రి ఉత్సవాలతో పాటు ఆడికృత్తిక, కార్తీక పౌర్ణమి పర్వదినాల్లో ఉభయతెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు నుంచి వచ్చే భక్తులతో ఆలయం కిటకిటలాడుతుంది.

- పుంగనూరు, ఆంధ్రజ్యోతి


అగస్తీశ్వరస్వామి ఆలయం


కొండపై వెలసిన కోనేరు



అద్భుత శిల్పకళతో అలరారుతున్న అగస్తీశ్వరాలయం

ఆలయం వద్ద అనేక శాసనాలు

మొదటి శాసనం క్రీ.శ 1192-92 నాటి మొదట కులోత్తుంగ వీరరాజేంద్రుడిది. రెండోది క్రీ.శ 1329లో ఈ ప్రాంతాన్ని పాలించిన గంగవంశరాజు సెల్వగంగరాజు, అతని పట్ట మహిషి సెల్వగంగ విగ్రహ ప్రతిష్ట చేశారని. మూడోది అగస్తీశ్వరుడికి స్వర్ణాభరణాలను బహూకరించినట్లు, నాలుగో శాసనం ఆలయ నిర్వహణకు ప్రకటించిన భూమాన్యం ఉన్నాయి. గౌనిమండపం(గౌనోళ్ల మండపం)పాద భాగాన ఉన్న శాసనంలో తెలుగు అక్షరాలతో 1674లో బయరకూరుకు చెందిన అమ్మాజమ్మ గారి మనవడు లింగనగవుని హలిదేవమ్మ దంపతుల కుమారుడు ములువగలు గవుడు తమ పెద్దల శివప్రీతి కొరకు శివాలయంలో మండపం కట్టించినట్లు పేర్కొన్నారు.


ప్రత్యేక అలంకరణలో అగస్తీశ్వరస్వామి

ఆలయానికి వెళ్లే మార్గాలు

పుంగనూరు నుంచి రాయలపేట మార్గంలోని అలసాపురం మీదుగా 7 కిలో మీటర్లు, చౌడేపల్లె నుంచి ఎ.కొత్తకోట మీదుగా 15కిలో మీటర్లు, పలమనేరు నుంచి వీరప్పల్లె మీదుగా, పెద్దపంజాణి నుంచి నేలపల్లె మీదుగా నెక్కొంది కొండపైకి రోడ్డు మార్గాలున్నాయి.

ఉట్టిపడుతున్న శిల్పకళ

అగస్తీశ్వర స్వామి ఆలయ పరిసరాలు చోళరాజుల కాలంనాటి శిల్పకళ నైపుణ్యంతో ఉట్టిపడుతుంటాయి. ఆలయం ముందుభాగంలో 16 స్తంభాలపై 18 రాతిమెట్లతో నాలుగంతస్తుల గౌనోళ్ల మండపంలో తామరపువ్వులు, అష్టభుజి ఆకారంలో 8 ద్వారాలతో అద్భుతంగా నిర్మించడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. చంద్రుని మింగుతున్న కేతువు బొమ్మను సుందరంగా చెక్కారు. కొండపై 240 అడుగుల పొడవు, వెడల్పుతో నాలుగు వైపులా ప్రాకారమండపాలు, నాలుగువైపులా ప్రవేశద్వారాల్లో నాలుగంతస్తుల గాలి గోపురాలు, పుష్కరిణిలోకి మెట్ల వరసలు, కోనేరు మధ్యలో నాలుగుకాళ్ల మండపాలు అందరినీ అలరిస్తున్నాయి. ఆలయం ప్రహరీ లోపల సుబ్రహ్మణ్య స్వామి, వినాయకుడు, చౌడేశ్వరి, ప్రసన్న పార్వతీ దేవి, జ్ఞానప్రసూనాంబిక అమ్మవారు, కాశీ విశ్వేశ్వరస్వామి, చండీశ్వరాలయం, వీరభద్రాలయం, భద్రకాళీ ఆలయాలు ఉన్నాయి. దక్షిణా మూర్తి మేకవాహనంపై ఉన్నారు.


గౌనివారి కల్యాణ మండపం

శివరాత్రి ఉత్సవాలకు నేడు అంకురార్పణ

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా 21వ తేదీ అంకురార్పణ జరగనుంది.22న వృషభ యాగం, ధ్వజారోహణం, 23న కలశ ప్రతిష్ట, అగ్నిప్రతిష్ట, సాయంత్రం హోమాలు, నిత్యోత్సవం, 24న రుద్రహోమం, కళాహోమం, సాయంత్రం నిత్యోత్సవం, 25న దేవీహోమం, కళాహోమం, నిత్యోత్సవం, 26న మహాశివరాత్రి నాడు ఉదయం అభిషేకాలు, సింహవాహనోత్సవం, సాయంత్రం నాలుగు యామాల పూజ, నిత్యోత్సవం, 27న నిత్య హోమాలు, 28న స్వామి వారి కల్యాణోత్సవం, నందివాహనోత్సవం, రథోత్సవం, సాయంత్రం గజవాహనోత్సవం, మార్చి 1న దోపోత్సవం, 2న శేషహోమం, మహాపూర్ణాహుతి, వసంతోత్సవం, త్రిశూలస్నానం, కుంభాభిషేకం, ధ్వజావరోహణ, 3న శయనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

వినియోగంలోకి జడ్పీ పాత సమావేశ మందిరం


పాత సమావేశ మందిరాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల చరిత్ర కలిగిన జడ్పీ పాత సమావేశం మందిరం వినియోగంలోకి రానుంది. గత టీడీపీ ప్రభుత్వంలో జడ్పీ చైర్‌పర్సన్‌గా గీర్వాణి ఉన్నప్పుడు పాత సమావేశ మందిరం సభ్యులకు సరిపోవడం లేదని.. నూతన భవనాన్ని నిర్మించారు. ఏళ్ల చరిత్ర కలిగిన పాత సమావేశ మందిరాన్ని ఓ జ్ఞాపకంగా వదిలి.. దానిపైనే నూతన భవనాన్ని నిర్మించారు. అప్పటి నుంచి పాత మందిరాన్ని వినియోగించడం మానేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి ఈ మందిరాన్ని వాడకంలోకి తీసుకొస్తున్నారు జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు. ఈనెల 22వ తేదీన జరగనున్న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో కొన్నింటిని ఇందులో నిర్వహించనున్నారు. అలాగే చిన్న చిన్న సమావేశాలకు, ఇతర శాఖల కార్యక్రమాలకు నామమాత్రపు అద్దెతో ఇవ్వనున్నట్లు సీఈవో పేర్కొన్నారు. ఈ క్రమంలో పాత సమావేశ మందిరంలోని సీట్లు, లైట్లు, గోడల మరమ్మతులను ప్రారంభించారు.

హోంగార్డులకు దర్బార్


హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కమాండెంట్ మహేష్‌కుమార్

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్ హోంగార్డు యూనిట్ల పరిశీలన నిమిత్తం గురువారం చిత్తూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు కార్యాలయం వద్ద హోంగార్డులనుంచి గౌరవ వందనం స్వీకరించి, దర్బార్ నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. మెడికల్ క్యాంపు నిర్వహణలో అందరూ భాగస్వాములవ్వాలని సూచించారు. జిల్లాలో శాంతి భద్రతల కోసం 362మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారని,వీరితోపాటు137మంది వివిధ విభాగాల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారని చెప్పారు. తిరుపతి హోంగార్డు డీఎస్పీ చిరంజీవి, ఆర్ఐ చంద్రశేఖర్, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు బాల, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీసీవో గీత తెలిపారు. గురువారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఆసక్తి కలిగినవారు https//apbragcel.apcfss.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ ఆరో తేదీన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఐదో తరగతికి, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. బాలికలకు చిత్తూరు, జీడీ నెల్లూరు, పలమనేరు. కుప్పం గురుకుల విద్యాలయాల్లో.. బాలురకు రామకుప్పం, పూతలపట్టు, విజలాపురం గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలు ఉంటాయన్నారు. ఇతర వివరాలకు 79955 62127, 08572-295699 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

బంగారుపాళ్యం,ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి):ఓ బాల్య వివాహాన్ని పోలీసులు అడ్డుకున్నారు. గురువారం పలమనేరు మండలానికి చెందిన ఓ బాలిక(16)కు బంగారుపాళ్యం మండలానికి చెందిన 26 ఏళ్ల యువకుడితో పెళ్లి చేయడానికి బాలిక తల్లిదండ్రులు నిర్ణయించారు. గురువారం ఉదయం వారు మొగిలి శివాలయం వద్ద ఉండగా పలమనేరు సీడీపీవో ఇందిర ప్రియదర్శినికి సమాచారం అందింది. ఆమె ఫిర్యాదుతో స్థానిక సీఐ కత్తి శ్రీనివాసులు తన సిబ్బందితో వెళ్లి వివాహాన్ని అడ్డుకున్నారు. అనంతరం తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ ముందు బాలిక తల్లిదండ్రులను హాజరుపరచగా కౌన్సెలింగ్ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

తవణంపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతికి చెందిన నిరూప తన కుమారుడు కిరణ్‌కుమార్(11), సమీప బంధువు లక్ష్మయ్యతో కలిసి తిరుపతి నుంచి పలమనేరు వైపు ద్విచక్ర వాహనంలో బయల్దేరారు. తవణంపల్లె మండలంలోని కాణిపాకపట్నం సమీపంలోని తిరుపతి-బెంగళూరు హైవేపై ఓ దాబా వద్దకొచ్చేసరికి ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కిరణ్ కుమార్‌కు తీవ్రంగా, నిరూప, లక్ష్మయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కిరణ్‌కుమార్ మృతి చెందాడు. ఈ సంఘటనపై తమకు ఎటువంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

నియోజకవర్గానికి రూ.కోటి మంజూరుకు ప్రతిపాదనలు పంపండి

● '20 సూత్రాల' కమిటీ చైర్మన్ లంకా దినకర్



సమావేశంలో ప్రసంగిస్తున్న దినకర్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో భాగంగా జిల్లాలో 20 సూత్రాల కార్యక్రమాలను పటిష్ఠంగా అమలు చేయాలని అధికారులను కమిటీ చైర్మన్ లంకా దినకర్ ఆదేశించారు. గురువారం చిత్తూరులోని కలెక్టరేట్ మీటింగ్ హాలులో జిల్లాలో 20 సూత్రాల కార్యక్రమాల అమలుపై కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్, చిత్తూరు మేయర్ అముదలతో కలసి సమీక్షించారు. జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక నిధి కింద రూ.కోటి మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందుండే విధంగా సీఎం చంద్రబాబు విజన్-2047 కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించడం అధికారుల బాధ్యత అన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు విజన్-2047, స్వర్ణకుప్పం - 2029 కార్యక్రమాలను ప్రారంభించారన్నారు. రాష్ట్ర సరిహద్దుల్లో పరిశ్రమలకు సంబంధించి మరమ్మతులకు గురైన రోడ్లను త్వరగా పూర్తిచేస్తామన్నారు. ఇప్పటికే రూ.10-15 కోట్ల రుణాలకోసం ముందస్తుగా ప్రతిపాదనలు తీసుకున్నామని చెప్పారు. ఓహెచ్ఆర్ ట్యాంకుల మరమ్మతులకు, నిధుల కేటాయింపునకు, మ్యాంగో బోర్డు, సెరికల్చర్ కింద సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ చిత్తూరు, కుప్పంలో కేంద్రీయ విద్యాలయం, డిజిటల్ సైన్స్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు, పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా దేవాలయాల అనుసంధానానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జగన్మోహన్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రోడ్ల నిర్వహణ చురుగ్గా సాగుతున్నదని, మున్సిపాలిటీలకు సంబంధించి అనుసంధాన రహదారులు లేవని చెప్పారు. ఎన్టీఆర్ అడవిపల్లె రిజర్వాయర్ పనులు 82శాతం పూర్తయ్యాయని, ఈ రిజర్వాయర్ ఏర్పాటు సీఎం చంద్రబాబు సంకల్పమన్నారు. అవసరమైన నిధుల కేటాయింపునకు కృషిచేయాలని చైర్మన్ కోరారు. డీఆర్వో మోహన్‌కుమార్, సీపీవో సాంబశివారెడ్డి, డ్వామా పీడీ రవికుమార్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు చంద్రశేఖర్ రెడ్డి, విజయ్‌కుమార్, డీపీవో సుధాకర్ రావు, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, డీఎస్వో శంకరన్, హౌసింగ్ పీడీ గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సామాజిక వర్గానికి చెందిన వారెవరో చెప్పాలి?

అనైతిక వ్యాఖ్యలు చేస్తే ఉద్యోగులే తగిన బుద్ధి చెప్తారు ● ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిపై ఎన్జీవో సంఘం ఫైర్

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సీఎం సామాజిక వర్గానికి చెందిన వారెవరో చెప్పాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణరావును ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేవీ రాఘవులు, కార్యదర్శి రఘు ప్రశ్నించారు. గురువారం ఎన్జీవో భవనంలో వారు మీడియాతో మాట్లాడారు. ఎవరు సీఎంగా ఉంటే ఆ సామాజిక వర్గానికి చెందిన వారిని ఉద్యోగ సంఘ నేతలుగా ఎన్నుకోవడం పరిపాటిగా మారిందని ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఎన్జీవో సంఘ చరిత్రను ముందు తెలుసుకోవాలని సూచించారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు అశోక్ బాబు, జగన్ సీఎంగా ఉన్నప్పుడు బండి శ్రీనివాస్, ఇప్పుడు శివారెడ్డి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. సూర్యనారాయణరావు ఆ సంఘంలో రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నప్పుడు ఆస్కార్‌రావు చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన ఇలాగే అనైతిక వ్యాఖ్యలు చేస్తే ఉద్యోగులే తగిన బుద్ధి చెబుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో కార్యనిర్వాహక కార్యదర్శి ప్రదీప్, కోశాధికారి మురళి, తాలూకా కార్యదర్శి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ ఆలయంలో లక్ష కుంకుమార్చన


లక్ష కుంకుమార్చనలో భక్తులు - ప్రత్యేక అలంకారంలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో రెండవ రోజైన గురువారం కూడా వైభవంగా లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారికి అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. మాఘ మాసం సందర్భంగా కొండపై ఉన్న డార్మెటరీ హాల్లో అమ్మవారి ఉత్సవ మూర్తిని, శ్రీచక్రాన్ని అలంకరించి, కళశస్థాపన చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారి వెండి ప్రతిమకు ఉభయదారులచే లక్ష కుంకుమార్చన నిర్వహించారు.గణపతి, ఆదిత్య, నవగ్రహ, చండీహోమాలను నిర్వహించాక భక్తులు అమ్మవారి లక్ష కుంకుమార్చనలో పాల్గొన్నారు. 151 మంది దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు.వారికి అమ్మవారి తీర్థ ప్రసాదాలను ఈవో ఏకాంబరం అందజేశారు.

సారా తయారీ, మద్యం అక్రమ అమ్మకాలపై ఉక్కుపాదం

టోల్ ఫ్రీ నెంబరు 14405కు సమాచారం ఇవ్వండి

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్



టోల్ ఫ్రీ నెంబరును చూపుతున్న విజయశేఖర్

వెదురుకుప్పం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సారా తయారీ, మద్యం అక్రమ అమ్మకాలపై ఉక్కుపాదం మోపడానికి ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్(డీసీ) విజయశేఖర్ వెల్లడించారు. గురువారం కార్వేటినగరం ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ చేశారు. అనంతరం సీఐ శిరీషారెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఇకపై నాలుగు శాఖల అనుసంధానంతో కమిటీలను నియమించి దాడులు చేస్తామన్నారు. గ్రామాల్లో సారా తయారీ, అమ్మకాలపై టోల్ ఫ్రీ నెంబరు 14405కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టండి

అవసరమైతే డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాలోని అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టండి. అవసరమైతే డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలి' అని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన 'ఆడపిల్లల ప్రాముఖ్యత-పీసీ అండ్ పీఎన్‌డీటీ' ఆవశ్యకత, మెడికో లీగల్, లైంగిక వేధింపులపై డీఎంహెచ్‌వో ప్రభావతితో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. డీఎంహెచ్‌వో వద్ద తప్పనిసరిగా ప్రభుత్వ, ప్రైవేటు అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాల యాజమాన్యాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జిల్లాలో వెయ్యిమంది మగశిశువులకు 954మందిఆడశిశువులు ఉన్నారని చెప్పారు. అందువల్ల ఆడపిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి న్యాయ, పోలీసు, స్త్రీ, శిశు, వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈవో వరలక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి చెన్నయ్య, ఇతర శాఖల అధికారులు, ఎన్జీవోలు, ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితా పరిశీలనలో ఆర్జేడీ బృందం


జాబితా పరిశీలనలో ఆర్జేడీ బృందం

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): టీచర్ల సీనియారిటీ జాబితా తయారీని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ నేపథ్యంలో పరిశీలనకు రాయలసీమ రీజనల్ జాయింట్ డైరెక్టరేట్ (ఆర్జేడీ) శామ్యూల్ ఆదేశాలతో తన కార్యాలయ ఏడీ విజయకుమార్, సూపరింటెండెంట్ బాబు నాయక్‌లు చిత్తూరు డీఈవో కార్యాలయానికి వచ్చారు. ఇప్పటికే నాలుగు బృందాలు ఈ ప్రక్రియలో ఉండగా, వేగవంతం చేసేందుకు రెండ్రోజులుగా మరో మూడు బృందాలను డీఈవో వరలక్ష్మి రంగంలోకి దించారు. ఏడీలు రంగస్వామి, వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్లు సత్యనారాయణ, రామకుమార్, వీజీ రమణలు వీటిని పర్యవేక్షిస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి గురువారం తెల్లవారు జాము నాలుగు గంటల వరకు సీనియారిటీ జాబితా ఆన్‌లైన్ ప్రక్రియ.. చిత్తూరు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ముమ్మరంగా సాగింది. సమస్యలను గుర్తించి పరిష్కరించడంతోపాటు ప్రక్రియ వేగవంతం అయ్యేందుకు ఆర్జేడీ బృందం చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు 408 హెచ్ఎంల జాబితా పూర్తవగా, 7,534 స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో 400 పెండింగ్‌లో ఉండగా, 6,443 సెకండరీ గ్రేడ్ టీచర్లకు సంబంధించి 1,500 పెండింగ్‌లో ఉన్నాయి. గురువారం రాత్రికి ఇవన్నీ పూర్తిచేసి, రాష్ట్ర విద్యాశాఖ అధికారుల లాగిన్‌కు పంపనున్నారు.

విండోల కంప్యూటరీకరణ నెలాఖరులోగా పూర్తిచేయాలి : జేసీ

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): 'ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (సింగిల్ విండో) బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ప్రస్తుతం కొనసాగుతున్న కంప్యూటరీకరణ ప్రక్రియను నెలాఖరులోగా పూర్తిచేయాలి' అని జేసీ, డీసీసీబీ స్పెషలాఫీసర్ విద్యాధరి సూచించారు. గురువారం డీసీసీబీ బ్యాంకు ఆవరణలో సహకారశాఖ అధికారులతో ఆమె సమీక్షించారు. కంప్యూటరైజేషన్ ప్రక్రియ 90 శాతం నిర్వహించి, రాష్ట్రస్థాయిలో జిల్లా తృతీయ స్థానంలో ఉందన్నారు. జిల్లాలో 1.85 లక్షల మంది రైతులు సింగిల్‌విండోల్లో సభ్యులుగా ఉన్నారని చెప్పారు. బ్యాంకు సీఈవో శంకర్ బాబు, జీఎం మనోహర్ గౌడ్, డీజీఎం చలపతి, డీఎల్సీవో వనజ, విండోల సూపర్ వైజర్లు, బ్యాంకు మేనేజర్లు, సహకారశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్, టెన్త్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా చిత్తూరు నుంచి ఎస్పీ మణికంఠతో కలిసి పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 50 పరీక్ష కేంద్రాల్లో 30,652 మంది ఇంటర్ విద్యార్థులు, 118 కేంద్రాల్లో 21,248 మంది టెన్త్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ఇదివరకే సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించామన్నారు.

నేడు మాల కార్పొరేషన్ చైర్మన్ పర్యటన

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్ శుక్రవారం జిల్లాలో పర్యటిస్తారని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు దళిత సంఘాల నేతలతో చిత్తూరు టీటీడీసీ జిల్లా సమాఖ్య (డెయిరీ సమీపంలో)లో సమావేశం అవుతారని పేర్కొన్నారు. దళిత నాయకులు, ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారులు హాజరు కావాలని కోరారు.

శిథిలావస్థలో షాదీమహల్..!

● నూతన భవనాల కోసం ఎదురుచూపు ● టీడీపీ హయాంలో నిధులు మంజూరు
● వైసీపీ అధికారంలోకి రాగానే నిలుపుదల ● కూటమి ప్రభుత్వంపై ముస్లింల ఆశలు


శిథిల దశలో ఉన్న రామకుప్పం షాదీమహల్


ధ్వంసానికి గురైన కిటికీలు, గేట్లు


దుస్థితిలో మరుగుదొడ్లు

రామకుప్పం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంలో రెండు దశాబ్దాల క్రితం ముస్లింల సౌకర్యార్థం నిర్మించిన షాదీమహల్ భవన సముదాయం శిథిలావస్థకు చేరుకుంది. 1997లో రామకుప్పం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద టీడీపీ కల్యాణ మండపాన్ని ప్రారంభించేందుకు సీఎం చంద్రబాబు వచ్చారు. ఆ సమయంలో జామియా మసీదు వద్ద ముస్లింలు గుమికూడి పట్టణం లోని జనాభాలో రెండో స్థానంలో ఉన్న తమ కోసం షాదీమహల్ నిర్మించాలని వారు కోరారు. కోరిన వెంటనే చంద్రబాబు షాదీమహల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. 1998 మార్చి 3న ఆయన చేతుల మీదుగానే షాదీమహల్ నిర్మాణానికి శంఖుస్థాపన చేసి ఏడాది లోపు నిర్మాణం పూర్తి చేశారు. దాత సికిందర్‌సాబ్ ఇచ్చిన స్థలంలో షాదీమహల్‌ను నిర్మించారు. 2001 సెప్టెంబరు 9న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే ప్రారంభించారు. అనంతరం అక్కడ వంటగది, భోజనశాలలు నిర్మించారు. దశాబ్దకాలం పాటు అక్కడ ముస్లింలు వివాహాది శుభకార్యాలు, ప్రభుత్వ శాఖల సమావేశాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించేవారు. అనంతరం షాదీమహల్ నిర్వహణ కమిటీల నిర్లక్ష్యం, నిర్వాకం కారణంగా ప్రస్తుతం షాదీమహల్ ప్రధాన భవనం, వంటగది, మరుగుదొడ్లు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. ప్రధాన భవనం కిటికీలు ధ్వంసమయ్యాయి. గోడలు సైతం దెబ్బతిన్నాయి. వంటగదిలో పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. మరుగుదొడ్ల పైకప్పులు ధ్వంసమైపోయాయి. బోరు మోటారు సైతం మరమ్మతులకు నోచుకోలేదు. ఈ పరిస్థితుల్లో పేద ముస్లింలు వివాహాది శుభకార్యాలను ఇళ్ల వద్దే నిర్వహించుకోవాల్సి వస్తోంది. మరికొందరు పొరుగు మండల కేంద్రాల్లోని కల్యాణ మండపాల్లో వ్యయ ప్రయాసలతో జరుపుకుంటున్నారు.

గతంలో రూ.40 లక్షల నిధులు మంజూరు

షాదీమహల్ దుస్థితిపై 2018లో అప్పటి సీఎం చంద్రబాబుకు స్థానిక ముస్లిం నేతలు వినతి పత్రం అందించారు. పాత షాదీమహల్ స్థానంలో కొత్త భవన సముదాయం నిర్మించాలని కోరారు. దీనిపై స్పందించిన రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ 2019 ఫిబ్రవరిలో షాదీమహల్ పునర్నిర్మాణానికి రూ.40 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో టీడీపీ పరాజయం కావడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో నిధుల మంజూరు ఆగిపోయింది. ఆ పార్టీ ముస్లిం నేతలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. రాష్ట్రంలో నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముస్లిం సోదరుల్లో ఆశలు చిగురించాయి. సీఎం చంద్రబాబు స్పందించి రామకుప్పంలోని శిథిల దశకు చేరుకున్న షాదీమహల్‌ను తొలగించి కొత్తగా భవన సముదాయం నిర్మించాలని కోరుతున్నారు.

బంగారు తిరుత్తణి కొండకు నిప్పు

● మామిడి చెట్లు దగ్ధం


కొండ సమీపంలో మంటలను అదుపు చేస్తున్న రైతు

సోమల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణం సమీపంలోని బంగారు తిరుత్తణి కొండకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కొండలోని అటవీ సందప అగ్నికి ఆహుతై నష్టం జరిగింది. అటవీ శివారులోని పలు మామిడి తోటల్లోకి మంటలు వ్యాపించడంతో రైతులు గురువారం అధికారులకు ఫిర్యాదు చేశారు. కందూరు రోడ్డులోని పొలాలకు మంటలు వ్యాపించాయి. బంగారు తిరుత్తణి కొండ ఆలయం ఆవరణలోని పలు వృక్షాలు కాలిపోయాయి. మంటలను ఆపడానికి రైతులు శ్రమపడ్డారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు క్రీడాపోటీలు


కబడ్డీ పోటీల్లో తలపడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కల్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా మూడో రోజు గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంఈఓలు శిద్ధరామయ్య, పోకల తాతయ్య పోటీలను ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు విజయలక్ష్మీ, రమాదేవి, ఆర్పీలు వెంకటశివ, కృష్ణవేణి, సయ్యద్ బాషా, రామాంజులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుత్తార్లపల్లెలో ఆర్డీవో పర్యటన


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసురాజు

గుడుపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లసాగరం పంచాయతీ గుత్తార్లపల్లె గ్రామంలో గురువారం ఆర్డీవో శ్రీనివాసురాజు పర్యటించారు. గ్రామంలోని అన్నదమ్ముళ్ల భూ సమస్యను ఆర్డీవో పరిష్కరించారు. నక్కనపల్లెలో సర్వే నంబరు 80/14, 80/13 ప్రభుత్వ భూమిని నాగరాజు, శంకర్ డీకేటీ పట్టా పొందారు. హద్దుల విషయంగా ఇరువురు గత కొన్ని నెలలుగా తగాదాలు పడుతున్నారు. ఇరువురు ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించారు. స్పందించిన ఆర్డీవో గురువారం ఇన్‌చార్జి తహసీల్దారు కిరణ్ కుమార్‌తో కలిసి ఇరువురు రైతులతో మాట్లాడి భూ సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు అమీర్, సర్వేయర్ రత్నప్ప, వీఆర్‌వోలు సురేష్, హరికృష్ణ, గ్రామ సర్వేయర్ జయంత్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ నాయకుడి మృతి


కృష్ణకు నివాళులర్పిస్తున్న గౌనివారి తదితరులు

రామకుప్పం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం కొంగనపల్లె మాజీ సర్పంచ్ గీతాంజలి భర్త టీడీపీ సీనియర్ నేత కృష్ణ (పెద్ద కృష్ణప్ప) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. సీఎం పీఏ మనోహర్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, నేతలు రామ్మూర్తి, నాగభూషణం, టీవీ రవి, కొళ్లపల్లెబాబు, విజయ్‌కుమార్ రెడ్డి, బాలరాజు, సురేష్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి టీడీపీ ఆర్థికసాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం సింగసముద్రానికి చెందిన చిన్నక్క గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు స్థానిక నేతలతో కలిసి చిన్నక్క మృతదేహానికి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ తరపున రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో నేతలు రామ్మూర్తి, గంట్లప్పగౌడు, జయశంకర్, నందారెడ్డి, నాగభూషణం, గిరిదాసు, బాలరాజు, కృష్ణప్ప, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వన్యమృగాల దాహార్తికి చర్యలు


అటవీ ప్రాంతంలో నీటి వసతి కల్పిస్తున్న అధికారులు

రామకుప్పం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వేసవిలో అడవుల్లోని వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు ననియాల అటవీ విభాగంలో 15 సాసర్‌పిట్లు నిర్మించినట్లు ననియాల అటవీ విభాగాధికారి హరికుమార్ తెలిపారు. గురువారం నాయకనేరి, పీఎంకేతాండా అటవీ ప్రాంతాల్లో నిర్మించిన సాసర్‌పిట్లలో స్థానిక అటవీ అధికారులతో కలిసి ఆయన నీటిని నింపారు. వన్యప్రాణులు నీటి కోసం పొలాలు, జనావాసాల వైపు రాకుండా అడవిలో సాసర్‌పిట్లలో నీటిని నింపడమే కాకుండా ట్రాకర్ల తో వన్యప్రాణుల కదలికలను ముందుగా పసిగట్టి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీట్ అధికారి నిరంజన్, అసిస్టెంట్ బీట్ అధికారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై విద్యార్థులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య విద్యాధికారి సావిత్రి

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడపనత్తం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ ఆరోగ్య విద్యాధికారి సావిత్రి ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలికా విద్య, బాల్యవివాహాలతో కలిగే సమస్యలు, లింగవివక్షత, వ్యక్తిగత శుభ్రత తదితర అంశాల గురించి వివరించారు. అలాగే గొల్లచీమనపల్లె ప్రాథమిక పాఠశాలలో తీర్థం పీహెచ్‌సీ ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ పోషకాహార ప్రాముఖ్యత, పరిసరాల పరిశుభ్రత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలకు 320 మంది హాజరు


సోమలలో సూచనలిస్తున్న ఎంపీడీవో నారాయణ

సోమల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో కార్పొరేషన్ రుణాలకు గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 320 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 320 మంది ధ్రువీకరణ పత్రాలను అధికారులు, బ్యాంకు మేనేజర్లు పరిశీలించారు. సోమల యూనియన్ బ్యాంకు మేనేజర్ జ్యోతి ప్రకాశ్, నంజంపేట గ్రామీణ బ్యాంకు మేనేజర్ పవన్ కుమార్, పెద్దఉప్పరపల్లె గ్రామీణ బ్యాంకు మేనేజర్ మహేశ్, కందూరు గ్రామీణ బ్యాంకు ఇన్‌చార్జి మేనేజర్ వెంకన్నబాబు, సచివాలయ కార్యదర్శులు, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

24న కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

కల్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో బీసీ, ఈబీసీ, కాపు, కమ్మ, రెడ్డి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఈనెల 24న మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రాజశేఖర్‌బాబు తెలిపారు. ధ్రువపత్రాలతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు.

● చౌడేపల్లె: బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లీలా మాధవి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్నవారు వారి ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

●రామకుప్పం: రామకుప్పం మండలంలో సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 25, 27 తేదీల్లో ఉదయం 11 గంటలకు మండల పరిషత్తు కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయని ఎంపీడీవో మురళీధర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 25న బందార్లపల్లె, రామకుప్పం, మణీంద్రం, 89పెద్దూరు, ముద్దనపల్లె, ననియాలతాండా, నారాయణపురంతాండా, విజలాపురం, వీర్నమల, ఉస్సిగానిపల్లె, సింగసముద్రం, కెంచనబల్ల, బల్ల, గొరివిమాకులపల్లె, పంద్యాలమడుగు, పీఎంకేతాండా పంచాయతీల అభ్యర్థులకు, 27న చెల్దిగానిపల్లె, కొంగనపల్లె, బైపరెడ్లపల్లె, రాజుపేట పంచాయతీల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

ఇమాంలకు గౌరవ వేతనం హర్షణీయం

సోమల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మసీదుల్లోని ఇమాంలకు బకాయి ఉన్న గౌరవ వేతనాలు రూ.45 కోట్లు ప్రభుత్వం విడుదల చేయడం హర్షణీయమని టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా సంయుక్త కార్యదర్శి అష్రఫ్ అలీ అన్నారు. ముస్లిం, మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

డేటాఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఉచిత శిక్షణ

పలమనేరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్ హబ్‌లో డొమెస్టిక్ డేటాఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేసులు తెలిపారు. ఈనెల 22 లోపు కోర్సులో శిక్షణ పొందాలనుకున్న నిరుద్యోగ యువతీ యువకులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్‌నంబరు 8465830771 ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా సల్లాపురెమ్మ జాతర



బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తఇండ్లు గ్రామంలో సల్లాపురెమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం అమ్మవారిని నడివీధిలో కొలువుదీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్ గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రఘుచంద్రగుప్తా, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు భువనచంద్రగౌడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

టెంపో ఢీకొని నేలకూలిన విద్యుత్ స్తంభాలు



వి.కోట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వి.కోట పట్టణంలో ఓ టెంపో డ్రైవర్ మద్యం మత్తులో వాహనాన్ని నడపడంతో రెండు చోట్ల విద్యుత్ స్తంభాలు విరగడంతో అర్ధరాత్రి నుంచి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం నెలకొంది. గాండ్లపల్లెకు చెందిన డ్రైవర్ బుధవారం రాత్రి కుప్పం వైపు నుంచి వస్తూ పట్టణంలోని బాలికల వసతి గృహం వద్ద రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ప్రమాదంలో విద్యుత్తు తీగలు తెగిపడటంతో పట్టణంలో బుధవారం రాత్రి నుంచి విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఉదయాన్నే గమనించిన ట్రాన్స్‌కో అధికారులు చేరుకుని విరిగిన స్తంభాన్ని మార్చుచేసి లైన్ సరిచేశారు. గాండ్లపల్లెకు వెళ్లే మార్గంలో ఆలయం ముందు భాగాన్ని టెంపో ఢీకొంది. దీంతో నిర్మించిన అరుగు పూర్తిగా ధ్వంసం కాగా.. ఆలయం ఎదుట షెడ్డు పూర్తిగా నేలమట్టమైంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వి.కోటలో వీరాంజనేయస్వామి పుష్పపల్లకి


విద్యుత్ దీపాలంకరణతో వీరాంజనేయస్వామి ఆలయం

వి.కోట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వి.కోట పట్టణంలో వెలసిన వీరాంజనేయస్వామి వారి పుష్పపల్లకి సేవ శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త సుబ్బన్న తెలిపారు. ఏటా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా ఉత్సవానికి భారీగా భక్తులు తరలిరానుండటంతో పట్టణంలో 21న సాయంత్రం 6 గంటల నుంచి ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నట్లు సీఐ సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆలయ పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయం వద్దకు ఎమ్మెల్యే, పట్టణ ప్రముఖులు చేరుకుని పట్టు వస్త్రాలను సమర్పించారు.

కన్నబిడ్డను మాయం చేశాడని నిరసన


నిరసన తెలుపుతున్న ఉషశ్రీ కుటుంబ సభ్యులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కన్న బిడ్డను తన భర్త మాయం చేశాడని పుంగనూరు పట్టణంలోని కొత్తపేటకు చెందిన ఉషశ్రీ గురువారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త మరో మహిళతో అక్రమ సంబంధంతోపాటు మద్యానికి బానిక కావడంతో తరచూ గొడవలు పడుతుంటారని .. తాను ఇద్దరి కుమార్తెలతో పుట్టింటికి వెళ్లానని తెలిపారు. పుట్టింటికి వచ్చి తన పెద్ద కుమార్తెను తీసుకెళ్లాడని.. అయితే ఏడాది దాటినా తన కుమార్తె ఎక్కడుందో తెలియడం లేదని వాపోయింది. పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బోరున విలపించింది. తన కుమార్తె ఎక్కడుందో తనకు చూపాలని వాపోయింది. సంబంధిత అధికారులు న్యాయం చేయాలని దళిత సంఘ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, గంగులప్ప, జేవీ. నాగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మాలిగప్పకొట్టాలుకు తాగునీటి వసతి


తాగునీటి బోరుకు పూజ చేస్తున్న టీడీపీ నేతలు

కుప్పం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం వానగుట్టపల్లె పంచాయతీ మాళిగప్పకొట్టాలు గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పించిన సీఎం చంద్రబాబుకు గురువారం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో నూతనంగా వేసిన తాగునీటి బోరును టీడీపీ నేతలు ప్రారంభించారు. కార్యక్రమంలో రూరల్ టీడీపీ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యులు శాంతారాం, కురబ కుల రాష్ట్ర డైరెక్టర్ రాజగోపాల్, నేతలు శివకుమార్, సంతోష్, మణి, రవి, బీరప్ప తదితరులు ఉన్నారు.

అసత్య వార్తలు ప్రచారం చేస్తే చర్యలు : డీఎస్పీ



కుప్పం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో ఇటీవల ప్రమాదవశాత్తు జరిగిన మరణంపై అసత్య వార్తలను సోషల్ మీడియాలో ప్రచారం చేసిన ఘటనపై కేసు నమోదు చేసి వార్తలకు బాధ్యులైన నలుగురిని అరెస్టు చేసినట్లు కుప్పం డీఎస్పీ పార్థసారథి, రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ తెలిపారు. అసత్య వార్తలను ప్రచురించిన కొందరిని అరెస్టు చేశామని, మరికొందరిని గుర్తించామని వారిపై చర్యలు తప్పవన్నారు. ఇకపై వార్తలు ప్రచురించేటప్పుడు ఓసారి నిజ నిర్ధారణ చేసుకోవాలని.. వాటిని ప్రచురించాలని పోలీసు శాఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

రోడ్డు పనుల పరిశీలన


రోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులు మండలంలోని చెర్లోపల్లె సమీపంలో వ్యవసాయ పొలాలకు వేసిన రోడ్డు పనులను గురువారం పరిశీలించారు. పుంగనూరు పట్టణానికి చెందిన ఫయాజ్, నవాజ్, సురేంద్ర, అశోక్ తదితరులు ఆ రోడ్డును చదును చేసి వ్యవసాయ పొలాల్లోకి కలుపుకున్నారు. ఈ విషయంపై గ్రామస్తులు రమేశ్‌బాబు, రంగప్రసాద్, సుబ్బిరెడ్డి, నారాయణ, రెడ్డెప్ప కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన స్పందిస్తూ వివాదంలో ఉన్న రోడ్డు పనులను పరిశీలించాలని మండలస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో తహసీల్దార్ రాము, ఎంపీడీవో లీలామాధవి, ఏపీవో శివ, ఎస్‌ఐ లోకేశ్ పరిశీలించారు.

రూ.1.20 కోట్లతో యల్లమ్మ ఆలయ నిర్మాణం

●నేడు విగ్రహ ప్రతిష్ఠ





కల్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండల కేంద్రానికి సమీపంలోని కల్లూరు మార్గంలో రూ.120 కోట్లతో యల్లమ్మ ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహా కుంభాభిషేకం వేడుకలు శుక్రవారం వైభవోపేతంగా ప్రారంభమవుతున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోటూరి మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. సుమారు మూడు వందల ఏళ్ల క్రితం నుంచి ఈ ప్రాంతంలో ఓ చెట్టు కింద యల్లమ్మకు భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. పులిచెర్ల పరిసర ప్రాంతాల్లోని వివి ధ కులాలకు యల్లమ్మతల్లి ఇలవేల్పుగా ఇక్కడ పూజలందుకుంటోంది. రెండేళ్ల క్రితం గోటూరి కుటుంబ సభ్యులు ఆలయ నిర్మాణం పనులు ప్రారంభించారు. రూ.120 కోట్లతో పూర్తి చేశారు. ఈ వేడుకలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి.

వివక్ష లేకుండా ప్రజలందరికీ సమన్యాయం


మాట్లాడుతున్న ప్రభుత్వ ప్లీడర్ కృష్ణమూర్తి

గంగవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వివక్ష లేకుండా ప్రజలందరికీ సమన్యాయం జరగాలని ప్రభుత్వ ప్లీడర్ కృష్ణమూర్తి అన్నారు. గురువారం పలమనేరు పట్టణ సమీపంలోని షికారీకాలనీలో ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ప్రాథమిక హక్కులను సద్వినియోగం చేసుకొని, చట్టంలోని అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు యల్.భాస్కర్, ఆరీఫుల్లాఖాన్, ఆశాలు పాల్గొన్నారు.

శ్రీగంధం తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): శ్రీగంధం చెక్కలు తరలిస్తున్న ఓ వ్యక్తితో పాటు ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసినట్లు గురువారం సీఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని నల్లగుట్లపల్లె తాండాకు చెందిన నామానాయక్ కుమారుడు నామకేనాయక్(50, రత్నా(55), చిత్ర(50)లు కలిసి 27 కిలోల శ్రీగంధం చెక్కను వాహనంలో తరలిస్తూ పట్టుబడినట్లు పేర్కొన్నారు. వాహనాలతో సహా శ్రీగంధం చెక్కను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు కలప వేలం

గంగవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పలమనేరు అటవీ ప్రాంతంలో హైవే రోడ్డు పనుల కోసం నేలకూల్చిన కలపను గోరీతోపులో ఈనెల 27న వేలం నిర్వహిస్తున్నట్లు పలమనేరు అటవీశాఖ అధికారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలం పాటల్లో పాల్గొనే వారు దరావత్తు సొమ్ము రూ.500 చెల్లించి వేలంపాటల్లో పాల్గొనాలని, అటవీశాఖ అధికారులదే తుది నిర్ణయంగా ఉంటుందని ఆయన తెలిపారు.

చిన్నతాండాలో కారు చోరీ

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు నిలిపిన కారు బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీ చేసినట్లు బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుగాలిమిట్ట పంచాయతీ చిన్నతాండాకు చెందిన రూప్లానాయక్ తన కారును ఇంటిబయట పెట్టాడు. అయితే ఉదయాన్నే చూడగానే చోరీ జరిగినట్లు గుర్తించాడు.

ఎస్సీ, ఎస్టీలంటే అధికారులకు చులకన

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలంటే రెవెన్యూ అధికారులు చులకనగా చూస్తున్నారని బీజేపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు నరసింహులు, మాజీ కౌన్సిలర్ కృపాకర్ ఆరోపించారు. గురువారం వారు మాట్లాడుతూ కోనేరు రంగారావు కమిటీ నివేదిక ప్రకారం ప్రతినెలా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

లంకా దినకర్‌ను కలిసిన బీజేపీ నాయకులు



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంకా దినకర్‌ను పుంగనూరు బీజేపీ నాయకులు గురువారం కలిశారు. గురువారం చిత్తూరు బీజేపీ కార్యాలయంలో ఆయన్ను కలిసి పుంగనూరు పార్టీ స్థితిగతులపై చర్చించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వ పథకాలు అమలు తీరుపై ప్రజలల్లోకి వెళ్లి తెలుసుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జగదీశ్‌రాజు, నానాబాలకుమార్, ప్రసాద్, వెంకటరెడ్డి, శ్రీనివాసులు, ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించేదెప్పుడు?



పూతలపట్టు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టులో గ్రంథాలయ భవనాన్ని నిర్మించి ఏళ్లు గడుస్తున్నా వైసీపీ నేతల పుణ్యాన ఆ భవనం నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో స్థానిక ఉన్నత పాఠశాలలోని తరగతి గదిలోనే గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయం సమీపాన వైసీపీ ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపాయలు వెచ్చించి నూతన భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని వైసీపీకి చెందిన ఓ మంత్రి చేతుల మీదుగా ప్రారంభించాలని ఆ పార్టీ స్థానిక నేతలు.. సంబంధిత అధికారులతో మాట్లాడి ఓ నిర్ణయానికి వచ్చారు. కానీ పూతలపట్టు మండలంలోని వైసీపీ నాయకుల మధ్య విభేదాలు ఉండడంతో ఈ కార్యక్రమాన్ని ఆలస్యం చేశారు. తర్వాత ఎన్నికలు రావడంతో భవనాన్ని అలాగే వదిలేశారు. తరగతి గదిని తమకు ఇచ్చేసి నూతన భవనానికి వెళ్లిపోవాలని గ్రంథాలయాధికారులకు ఉపాధ్యాయులు చెబుతున్నా, ఆ అధికారి మండలశాఖ అధికారులతో మాట్లాడి ఈ భవనాన్ని ప్రారంభించలేదు.

‘సైబర్ నేరాలపై యుద్ధం’ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ మణికంఠ తదితరులు

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో ముద్రించిన సైబర్ నేరాలపై యుద్ధం - అవగాహనతో నియంత్రిద్దాం అనే వాల్‌పోస్టర్లను గురువారం ఎస్పీ మణికంఠ ఆవిష్కరించారు. విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ కన్జూమర్స్ ఆర్గనైజేషన్స్ వైస్ చైర్మన్ రాజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శేషాద్రి, కార్యదర్శి రామారావు, రమాదేవి, ప్రసాద్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకం: హోంగార్డు పనిచేస్తుండిన వేలు గత ఏడాది జూన్‌లో వేలు మరణించాడు. దీంతో ఆయన సతీమణి గాయత్రికి కారుణ్య నియామకం కింద ‘సి’ కేటగిరీ ఉద్యోగాన్ని ఇచ్చారు. దీనికి సంబంధించిన నియామక పత్రాన్ని గురువారం ఎస్పీ అందించారు. కర్నూలు రేంజ్ హోంగార్డు కమాండెంట్ మహేష్, తిరుపతి హోంగార్డు డీఎస్పీ చిరంజీవి, ఆర్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం: కలెక్టర్, ఎమ్మెల్యే



బ్లాక్ పబ్లిక్ హెల్త్‌సెంటర్‌ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే జగన్మోహన్

గుడిపాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యమని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. గురువారం బొమ్మసముద్రం పీహెచ్‌సీలో బ్లాక్ హెల్త్ సెంటర్‌ని వారు ప్రారంభించారు. ప్రభుత్వ వైద్యసేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. వైద్య సిబ్బంది కూడా రోగులతో స్నేహభావంతో మెలిగి మెరుగైన వైద్యం అందించాలన్నారు. డీఎంహెచ్‌వో సుధారాణి, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు, మాజీ జడ్పీటీసీ సుమతి, మండల ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, హరిప్రసాద్, తుమ్మల సాంబశివ నాయుడు, నాగరాజ్ యాదవ్, సర్పంచ్ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత కుటుంబీకులకు థామస్ పరామర్శ



చిన్నప్పనాయుడి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ విప్ థామస్

పెనుమూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపురం పంచాయతీ చలంపాళ్యం గ్రామానికి చెందిన టీడీపీ నేత చిన్నప్పనాయుడు గుండెపోటుతో మృతి చెందడం పార్టీకి తీరని లోటని ప్రభుత్వ విప్ థామస్ అన్నారు. ఆయన కర్మక్రియలకు పార్టీ నేతలతో కలిసి గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబీకులను పరామర్శించారు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు కార్జాల అరుణ, టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, మాజీ ఎంపీపీ హరిబాబు నాయుడు, పార్లమెంటు కార్యదర్శి తలారి రెడ్డెప్ప, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తినాయుడు, ప్రధాన కార్యదర్శి బాస్కర్, తెలుగు యువత కిషోర్‌నాయుడు, పీహెచ్‌సీ మాజీ చైర్మెన్ పరమేశ్వర్‌రెడ్డి, రుద్రయ్య, నిరంజన్‌రెడ్డి, అశోక్, ఏకాంబరం, గంగాధరం, రాజగోపాల్ నాయుడుతో పాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం: డీఎస్పీ



సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నగరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాలు కీలకమయ్యాయని డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు. రూ.2వేలకు ఇవి అందుబాటులో ఉన్నాయని.. తమ సిబ్బందిని సంప్రదించాలన్నారు. డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సీడీపీవో వినతశ్రీ

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కల్గుతుందని సీడీపీవో వినతశ్రీ అన్నారు. మహిళా దినోత్సవం పురస్కరించుకుని అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను గురువారం ఆమె ప్రారంభించారు. సూపర్‌వైజరు బిందుమాలతి, హైస్కూల్ పీడీలు రజని, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల సంతతి నియంత్రణకు చర్యలు

- ఏబీసీ కేంద్రం ప్రారంభోత్సవంలో కలెక్టర్



కలెక్టర్, ఎమ్మెల్యేతో కలిసి ఏబీసీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల సంతతి నియంత్రణకు చర్యలు చేపట్టామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ వాహనాల షెడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రా(ఏబీసీ)న్ని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నగర పరిధిలో సుమారు 7-8 వేల కుక్కలు ఉన్నట్లు అంచనా వేశామన్నారు. వీటి సంతతి నియంత్రించకుంటే భవిష్యత్తులో ప్రమాదాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. ఈ నేపథ్యంలో రూ.15 లక్షలతో ఏబీసీ కేంద్రాన్ని అందుబాటులో తెచ్చామన్నారు. గతంలో వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ చేయడానికి తిరుపతి, స్వచ్ఛంద సంస్థలపై ఆధారపడాల్సి వచ్చేదన్నారు. రెండేళ్లలో సుమారు 5-6 వేల కుక్కలకు ఈ కేంద్రంలో కు.ని ఆపరేషన్లు, వ్యాక్సినేషన్ వంటివి చేయడంతో వాటి సంతతి నియంత్రించవచ్చన్నారు. ఎమ్మెల్యే జగన్మోహన్ మాట్లాడుతూ.. ప్రజలకు మంచి పనులు చేయడంలో కలెక్టర్ ఎప్పుడూ ముందుంటారని ప్రశంసించారు. కమిషనర్ నరసింహ ప్రసాద్, పశు సంవర్థకశాఖ జేడీ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనం విడుదలపై హర్షం



చిత్తూరులో మీడియాతో మాట్లాడుతున్న ముస్లిం మైనార్టీ నేతలు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇమామ్‌లు, మౌజన్లకు రాష్ట్ర ప్రభుత్వం గౌరవ వేతనం విడుదల చేయడం హర్షణీయమని టీడీపీ నగర మైనార్టీ కమిటీ నేతలు అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు మైనార్టీల పక్షపాతి అన్నారు. అలాగే రంజాన్ తోఫా ఇస్తామని సీఎం చెప్పడం సంతోషంగా ఉందన్నారు. నేతలు ఫిరోజ్ బాయ్, అత్తు బాయ్, గౌస్, జిలాని, టైలర్ బాషా, రఫీ, సిరాజ్, మూసా తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రహమతుల్లా ఖాన్, నియోజక వర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్‌హుస్సేన్ తదితరులు కూడా హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి ఫరూఖ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు లోకనాథనాయుడు, రాధాక్రిష్ణమ నాయుడు, సర్దార్, నాసీర్ ఖాన్, గౌస్‌బాషా, హబీబ్, ఫైరోజ్ ఖాన్,జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకూడదు: ఎంపీపీ



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ శ్యామల

పాలసముద్రం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని సర్పంచులు, కార్యదర్శులను ఎంపీపీ శ్యామల కోరారు. గురువారం ఎంపీడీవో సమావేశ మందిరంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.70 లక్షలు, ఎంపీ నిధుల నుంచి రూ.10లక్షలు, మండల గ్రాంట్ నుంచి రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, వంతెనల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. 47 గోకులం షెడ్లు మంజూరవగా.. 37 పూర్తయ్యాయని ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి తెలిపారు. రైతులు ఈ నెలాఖరులోపు విశిష్ట సంఖ్య కోసం తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో డిల్లీబాబు సూచించారు. ఏఈలు లోకేష్‌రెడ్డి, చీరాలయ్య, శంకర్, జయరాజ్, దాము, డాక్టర్లు మోహనకృష్ణ, యశశ్రీ, ఎంఈవోలు రాజేంద్రప్రసాద్, గిరిజ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

‘పీజీఆర్‌ఎస్’ అర్జీలపై ఆర్డీవో ఆరా



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

గంగాధర నెల్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలానికి సంబంధించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో వచ్చిన అర్జీలపై తీసుకున్న చర్యలేమిటని చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు ఆరాతీశారు. గంగాధరనెల్లూరు తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. అలాగే పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం వింజం పంచాయతీలో ఓ అర్జీపరంగా విచారణకు వెళ్లినట్లు సమాచారం. డీటీ తులసీరామ్, పెద్దకాల్వ వీఆర్వో ద్రాక్షాయణి పాల్గొన్నారు.

25నుంచి జ్యోతిర్లింగాల ప్రదర్శన

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కట్టమంచి సూర్యప్రతాప్ కళ్యాణ మండపంలో ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు ద్వాదశ సహస్ర జ్యోతిర్లింగాల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. 21 అడుగుల మహా శివలింగం ఏర్పాటు చేయనున్నట్లు భక్తులు దర్శించుకోవాలని కోరారు. అలాగే కన్నయ్య నాయుడు కాలనీ, కట్టమంచి పెరుమాళ్ వీధి, ఎస్టేట్ జ్యోతిరెడ్డి నగర్, గిరింపేట కెప్టెన్ వీధుల్లోనూ శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని.. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి దుర్మరణం



తిరుమలేష్ మృతదేహం

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్ఆర్‌పురం మండలం కట్టికపల్లె గ్రామానికి చెందిన తిరుమలేష్(42) ద్విచక్ర వాహనంపై చిత్తూరు నుంచి గురువారం రాత్రి స్వగ్రామానికి బయల్దేరాడు. చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపైకొచ్చేసరికి చిత్తూరు వైపు వెళుతున్న తిరుపతి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో తిరుమలేష్ సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో ఇద్దరి వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ కత్తిశ్రీనివాసులు తెలిపారు. ఈనెల 15వ తేదీన మహాసముద్రం వద్ద ఉన్న టోల్‌ప్లాజా సమీపంలోని ఓ ఫ్యాక్టరీలో ఐరన్ యాంగిల్స్ దొంగతనం జరిగినట్లు మేనేజర్ యుగంధర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా గంగాధరనెల్లూరుకు చెందిన బాబు, ప్రసాద్ లను విచారించారు. చోరీ చేసినట్లు వారు అంగీకరించడంతో అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బైక్‌పై వెళుతున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గంగాధరనెల్లూరు మండలం కొండేపల్లెకి చెందిన సౌందర్యరాజ్(45) బైక్‌లో సొంత పనుల నిమిత్తం కార్వేటినగరం మండలం అమ్మపల్లె క్రాస్ రోడ్డు వద్ద వెళుతున్నాడు. ఆ సమయంలో వెనుక వైపు నుంచి వచ్చి వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని కార్వేటినగరం సీహెచ్‌సీకి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు.

బెల్టు షాపులపై పోలీసుల దాడులు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలంలో మూడు చోట్ల బెల్టు షాపులపై పోలీసులు దాడులు చేశారు. మూడు కేసులు నమోదు చేసి, ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. 98 క్వార్టర్ మద్యం సీసాలు, 9 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

వేలంపాట ద్వారా నగరి మున్సిపాలిటీకి రూ.62.56లక్షల ఆదాయం

నగరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వేలం ద్వారా నగరి మున్సిపాలిటీకి రూ.62.56 లక్షల ఆదాయం చేకూరింది. గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాలులో బహిరంగ వేలంపాట నిర్వహించారు. హరిబాబు.. వారపుసంతను రూ.20.65 లక్షలకు, భాస్కర్.. దినసరి మార్కెట్‌ను రూ.19.22 లక్షలకు, సుబ్రమణ్యం.. బస్టాండును రూ.10.15లక్షలకు, యోవాన్.. ఆటోస్టాండును రూ.12.19 లక్షలకు, సలీమ్.. జంతువధశాలను రూ.45వేలకు దక్కించుకున్నట్లు కమిషనర్ కృష్ణారెడ్డి వివరించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మున్సిపాలిటీకి రూ.25వేలు అదనంగా సమకూరినట్లు తెలిపారు.

ఇంటర్వ్యూలకు 550 మంది హాజరు

తవణంపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ కార్యాచరణ పథకం ద్వారా రుణాలు మంజూరుకు ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 550 మంది అభ్యర్థులు హాజరైనట్లు ఎంపీడీవో రెడ్డిబాబు తెలిపారు. బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

శివపార్వతులకు పట్టు వస్త్రాలు సమర్పించిన ప్రభుత్వ విప్

పెనుమూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రామాపురం శివాలయంలోని శివపార్వతులకు ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ గురువారం పట్టువస్త్రాలు సమర్పించారు. రామాపురానికి చెందిన నాగభూషణం కుటుంబీకులు స్వామి వారికి వెండి కిరీటం బహూకరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుండయ్య, యువత కార్యనిర్వాక కార్యదర్శి బీగాల రమేష్, మనోహర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, కృష్ణమూర్తినాయుడు, ఈశ్వర్‌ప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

ఉత్సవానికి ఆహ్వానం

వెదురుకుప్పం: తమ గ్రామంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవానికి రావాలని ప్రభుత్వ విప్ థామస్‌ను తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గురుసాల కిషన్‌చంద్, మాంబేడు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మోహన్‌యాదవ్, కార్యదర్శి యుగంధర్, కార్యనిర్వాహకులు సుబ్రహ్మణ్యం కోరారు. ఈ మేరకు ఆయనకు గురువారం ఆహ్వాన పత్రిక అందించారు.

సూర్యప్రభ వాహనంపై ఏకాంబరేశ్వరుడు



యాదమరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): త్రివేణి సంగమంలోని కామాక్షి సమేత ఏకాంబరేశ్వర ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ధ్వజారోహణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివారికి ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనసేవలు నిర్వహించారు.

పురుషామృగ, శేష వాహనాలపై చిదంబరేశ్వరుడి విహారం



శేషవాహనంపై స్వామివారు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర స్వామి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం స్వామి, అమ్మవార్లను పురుషామృగ, శేష వాహనాలపై ఊరేగించారు. శుక్రవారం సాయంత్రం కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ నిర్వాహకుడు కృష్ణమూర్తి, అర్చకుడు మహేష్ తెలిపారు.

‘కూటమి’ పాలనలోనే అభివృద్ధి సాధ్యం: టీడీపీ



కొత్తూరులో సీసీరోడ్డును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

గుడిపాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపాలనలోనే పల్లెల్లో అభివృద్ధి కార్యక్రమాలు పండుగ వాతావరణంలో జరుగుతున్నాయని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, సీనియర్ నేతలు గురజాల చెన్నకేశవులు నాయుడు, బాలాజి నాయుడు అన్నారు. గురువారం మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను వారు ప్రారంభించారు. ఎంపీడీవో శివరాజ్, ఏఈ ప్రసాద్ నాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

‘జ్ఞానజ్యోతి’తో అంగన్వాడీలు బలోపేతం : ఎస్ఎస్ ఏపీసీ



అంగన్వాడీ టీచర్లతో మాట్లాడుతున్న వెంకటరమణ

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంతో అంగన్వాడీ కేంద్రాలు బలోపేతమవుతాయని సమగ్ర శిక్ష (ఎస్ఎస్) ఏపీవో వెంకటరమణ అన్నారు. విద్యాశాఖ, ఐసీడీఎస్ ప్రాజెక్టులు సంయుక్తంగా గంగాధరనెల్లూరు, తూగుండ్రం హైస్కూల్లో అంగన్వాడీ టీచర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఎంఈవో ఆంజినేయులుశెట్టి, సీడీపీవో వినతశ్రీ, సూపర్‌వైజర్ బిందుమాలతి, ట్రైనింగ్ అధికారులు విజయకుమార్, వరదయ్య, దేవేంద్ర, పాఠశాల కమిటీ చైర్మన్లు, వైస్‌చైర్మన్లు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి బాల కామాక్షి అమ్మవారి ఆలయ కుంభాభిషేకం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కట్టమంచి బాలకామాక్షి సమేత కులందేశ్వర స్వామి ఆలయ కుంభాభిషేకం శని, ఆదివారాల్లో నిర్వహించనున్నామని ఈవో సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 22న గణపతి, నవగ్రహ, లక్ష్మీ హోమాలు, 23న కుంభాభిషేక కలశాల ఊరేగింపు, గోపుర విమాన, అమ్మవారి ఆలయ కుంభాభిషేకాలు, అన్నదానం నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

సంక్షిప్తంగా..

పూతలపట్టులో నేడు చికెన్ మేళా

పూతలపట్టు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద శుక్రవారం చికెన్‌మేళా నిర్వహించనున్నట్లు సీటీబీటీఏ ట్రేడర్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో చికెన్ తినడం వల్ల ఆరోగ్యానికి మేలు కలుగుతుందని ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. ఎమ్మెల్యే మురళీ మోహన్ ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు.

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ దినకర్, ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ భవానీప్రసాద్ గురువారం స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరిని ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ మహేష్‌కుమార్, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

అడవికి నిప్పంటించడం నేరం

గుడిపాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అడవికి నిప్పంటించడం నేరమని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఆనందరెడ్డి అన్నారు. గురువారం చిత్తపార, పిళ్లారికుప్పం, బండపల్లె గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బీట్ ఆఫీసర్ డిల్లీరాణి, జబీవుల్లా, అరుణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యం దిశగా పయనించాలి

వెదురుకుప్పం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని ఆ దిశగా పయనించాలని కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయులురెడ్డి సూచించారు. గురువారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగం ఆధ్వర్యంలో పర్సనాలిటీ డెవలప్‌మెంట్ స్టడీ స్కిల్స్ కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సెట్విన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.మోహన్‌రావు, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ధనంజయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి అభినందన



చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఇటీవల నిర్వహించిన ఖురాన్ పఠన పోటీల్లో చిత్తూరుకు చెందిన అఫ్షన్ రెండో స్థానంలో నిలిచాడు. దీంతో గురువారం ఆ చిన్నారిని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అభినందించారు. మైనార్టీ నాయకుడు జాఫర్ షరీఫ్, వడ్లమండి వీధి దర్గా నిర్వాహకులు, మత పెద్దలు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత మృతి

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వింజం పంచాయతీ సిద్దేశ్వరకొండ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్‌నేత పి.శంకర్‌రెడ్డి (57) అనారోగ్యం కారణంతో గురువారం సాయంత్రం మరణించారు. శుక్రవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

పీహెచ్‌సీలో ఫార్మసీ స్టోర్ ప్రారంభం



పూతలపట్టు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు పీహెచ్‌సీ ఆవరణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చిత్తూరు గోల్డ్, కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ వారు రూ.6లక్షలతో నిర్మించిన ఫార్మసీ స్టోర్, సమావేశ మందిరం, మినీ స్టోర్ రూమ్, లేడీస్ రెస్ట్‌రూమ్‌ను ప్రెసిడెంట్ ఎంవీ శ్రీధర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ లయన్ చంద్రారెడ్డి, జోన్ చైర్‌పర్సన్ బాస్కర్, వైద్యాధికారి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.